క్లుప్తంగా

గజ్జరంలో పేదలకు చీరల పంపిణీ

తాళ్లపూడి: గాడ్ లవ్స్ ఫౌండేషన్ అనే పేరుతో కొత్తగా స్వచ్ఛంద సేవాసంస్థను మండలంలోని గజ్జరం గ్రామంలో ఏర్పాటు చేశారు. పూలపల్లి బాలకృష్ణ ఏర్పాటు చేసిన ఈ సంస్థ లోగోను మాజీ ఎమ్మెల్యే, జనసేన పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు గురువారం ఆ గ్రామంలో ఆవిష్కరించారు. టీవీ రామారావు రూ.10 వేలు ఆ ఫౌండేషన్‌కు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఈ సేవాసంస్థ తరఫున 30 మంది వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యఅతిథి టీవీ రామారావును సన్మానించారు.కార్యక్రమంలో విజేత స్కూల్ ప్రధానోపాధ్యాయుడు జొన్నకూటి ప్రమోద్, నందన ఫౌండేషన్ సభ్యుడు రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

నిడదవోలు: స్థానిక 21 వార్డు నెహ్రూనగర్, 22 వార్డు వైఎస్సార్ కాలనీలలో మున్సిపల్ సాధారణ నిధులు, 14,15 ఆర్థిక సంఘ నిధులు రూ.1.59 కోట్ల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన, వివిధ పనుల ప్రారంభోత్సవాలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు హాజరయ్యే ఈ కార్యక్రమానికి మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

ఆగి ఉన్న లారీ ఢీకొట్టిన మరో లారీ

కొవ్వూరు: గామన్ బ్రిడ్జి వద్ద ఆగి ఉన్న ట్రాలీ లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక నుంచి ఢీకొట్టి లారీ క్యాబిన్ నుజ్జునుజ్జయ్యింది. ఆ లారీ హైదరాబాద్ నుంచి కాకినాడ ఎవెళుతుండగా మార్గమధ్యలో ఈనెల 18వ తేదీ తెల్లవారు జామున ఈ ప్రమాదానికి గురైంది.లారీ ప్రతినిధి ఎండీఎస్ షాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్సై డి.భూషణం తెలిపారు.ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

వైద్యానికి 'మానవత' ఆర్థిక సాయం

నల్లజర్ల: అనారోగ్యంతో బాధపడుతున్న నల్లజర్లలోని మూడు కుటుంబాలకు మానవత సంస్థ మండలశాఖ గురువారం రూ.12 వేల ఆర్థిక సాయం అందజేసింది. ప్రమాదంలో గాయపడ్డ మహ్మద్ షహన్‌షాకు, సాధనాల కుమారికి, కలపాల రాజారావులకు మందుల ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున అందజేసారు. కార్యక్రమాల్లో మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు ఐడీవీ అప్పారావు, పాతూరి సత్యనారాయణ, గుళ్ళపూడి వెంకటరత్నం, ఎస్.రాజేంద్రప్రసాద్, పల్లి వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

అట్లపాడులో తాగునీటి సమస్య

నిడదవోలు రూరల్: మండలంలోని అట్లపాడులో రక్షిత మంచినీటి పథకం బోరుకు చెందిన మోటర్ రెండు రోజులుగా పని చేయకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సర్పంచ్ దాయం రత్నకుమారి గ్రామ సమస్యలు పరిష్కారానికి సరిగా పట్టించు కోకపోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అంబేడ్కర్ సేన జిల్లా కన్వీనర్‌గా చినరాజు

దేవరపల్లి: ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ సేన వరల్డ్ ఆర్గనైజేషన్ జిల్లా కన్వీనర్‌గా మండలంలోని ధుమంతునిగూడెం శివారు సుబ్బరాయపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బట్టు చినరాజు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర కన్వీనర్ దప్పిల్ల దేవదాస్ ఉత్తర్వులు జారీ చేసినట్టు చినరాజు తెలిపారు. రాష్ట్ర కన్వీనర్ అనుమతితో మండల, నియోజకవర్గ కన్వీనర్లను నియమిస్తానని ఆయన తెలిపారు.

బాలోత్సవంతో విద్యార్థుల్లో నైపుణ్యం వృద్ధి

దేవరపల్లి: విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచడానికి బాలోత్సవ సంబరాలు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్సీ షేక్ సాబ్జి తెలిపారు. దేవరపల్లి బాలోత్సవ సంబరాల సన్నాహక సమావేశం బలుసు సత్యనారాయణ అధ్యక్షతన గురువారం సాయంత్రం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మాట్లాడారు. విద్యార్థుల్లో ఆలోచనలను పెంచడానికి ఈ సంబరాలు దోహద పడుతున్నాయన్నారు. పిల్లలు సమాజ సంపదని, వారి కోసం సమాజం ఎంతో చేయవలసి ఉందన్నారు. బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ 3 నుంచి 10 వతరగతి వరకు చదివే విద్యార్థులకు డిసెంబరు 7న దేవరపల్లిలో బాలోత్సవ సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. బాలోత్సవ కరపత్రాన్ని సాబ్జి ఆవిష్కరించారు.హేలాపురి బాలోత్సవ కమిటీ కార్యదర్శి గూడపాటి నరసింహరావు, కేశిరాజు సీతారామయ్య, ఉండవల్లి కృష్ణారావు, పేరం రవీంద్రనాథ్, పాల్గొన్నారు. బాలోత్సవం ఆహ్వాన కమిటీని ఎమ్మెల్సీ సాబ్జి ప్రకటించారు.

నేడు వైద్య శిబిరం

నిడదవోలు: పట్టణంలోని బసివిరెడ్డిపేటలో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. బసివిరెడ్డిపేట, 05,11 వార్డుల ప్రజలు ఈ శిబిరంలోని వైద్య సేవలను వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

బాలల మధ్య బాణసంచా తయారీనా?

- గోడౌన్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దు
- సమీప పాఠశాల యాజమాన్యం, రైతుల విజ్ఞప్తి
- ఇప్పటికే కలెక్టర్‌తో సహా జిల్లా అధికారులకు ఫిర్యాదు



బాణసంచా తయారీ కోసం నిర్మిస్తున్న గోడౌన్‌లు

నల్లజర్ల: మండలంలోని తెలికిచెర్ల గ్రామంలో దీపావళి బాణసంచాతో పాటు బాంబుల తయారీకి సన్నాహాలు జరుగుతున్నాయి. గతేడాది ఇదే రోజుల్లో కడియద్ద గ్రామంలో బాణసంచా తయారీలో బాంబులు పేలాయి. ఫలితంగా జన నష్టమే గాకుండా ఆస్తి నష్టం, పశు,పక్ష్యాదులకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. ఆ ప్రమాదం తర్వాత బాణసంచా తయారీ లైసెన్సు కోల్పోయిన వారే ఏడాది తిరగక ముందే మరో చోటుకు మకాం మార్చి ఇతరుల పేర్ల మీద ఇక్కడ లైసెన్సులకు పొందడానికి సమాయత్తం అవుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. తెలికిచెర్ల గ్రామంలోని నాయుడు నాగలక్ష్మి పొలంలో దీపావళి మందుగుండు సామగ్రి తయారీతో పాటు నాలుగు గోడౌన్ల నిర్మాణం జరుగుతోంది. తాడేపల్లిగూడెంకు చెందిన పండూరి సాయిమణి కంత పేరిట ఈ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఒక పక్క స్కూలు. మరోపక్క పచ్చని పొలాల్లో కూరగాయల సాగులో నిమగ్నమై ఉండే రైతులు, కూలీలు. ఇక్కడ బాణసంచా తయారీ జరిగితే వారందరికీ ఏక్షణంలోనైనా ప్రాణాపాయం పొంచి ఉన్నట్టే. అయితే ఈ విషయాన్ని పరిసర ప్రాంత రైతులకు తెలియకుండా వారి సంతకాలు ఫోర్జరీ చేసి గ్రామ పంచాయతీ నుంచి నో అబ్జక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) తీసుకున్నారు. అలాగే బాణసంచా తయారీ అనుమతి కోసం రెవెన్యూ అధికారులకు కూడా దరఖాస్తు చేశారు.

మేల్కొన్న పరిసర వాసులు

పాఠశాల, పంట పొలాల మధ్య బాణసంచా తయారీకి జరుగుతున్న ఏర్పాట్ల గురించి పరిసర ప్రాంత రైతులకు, నిర్మాణంలో ఉన్న గోడౌన్ల సమీపంలోని ఎస్‌కేఎస్ స్కూల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు కొంత ఆలస్యంగా తెలిసింది. దాంతో వారందరూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని పరిసర ప్రాంత రైతులు మేకా విశ్వేశ్వరరావు, కొత్త సత్యనారాయణమూర్తి, చిటికిబొత్తల ఆదిలక్ష్మి, సీమకుర్తి నాగ పుష్పమణిలతో పాటు ఎస్‌కేఎస్ స్కూల్ యాజమాన్యం తరఫున సీమకుర్తి వీరవెంకట సత్యనారాయణ కలెక్టరు, ఎస్పీ, విద్యా శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. బహిరంగ విచారణ చేపట్టకుండా అధికారులు బాణసంచా తయారీకి ఏవిధంగా అనుమతులు ఇస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ ఫిర్యాదులకు ముఖ్య కారకులైన ఎస్‌కేఎస్ స్కూల్ యాజమాన్యంపై బాణసంచా తయారీదారులు వివిధ రకాలుగా బెదిరింపులు, ఒత్తిళ్లు తీసుకు వస్తున్నారని వారంతా ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలో మందుగుండు సామగ్రి తయారీలకు ఎలాంటి అనుమతులు ఇవ్వకుండా తగు చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు. ఈ విషయమై తెలికిచెర్ల సర్పంచ్ బండి చిననాగరాజు (చిట్టి)ను 'సాక్షి' వివరణ కోరింది. గ్రామంలోని నాయుడు నాగలక్ష్మి పొలంలో దీపావళి మందుగుండు సామగ్రి తయారీకి పంచాయతీ నో అబ్జక్షన్ సర్టిఫికెట్ ఇచ్చిన మాట వాస్తవమేనని అంగీకరించారు. అయితే గ్రామ ప్రజల నుంచి వ్యతిరేకత వస్తున్న దృష్ట్యా దానిని రద్దు చేయనున్నట్టు ప్రకటించారు.

ఆర్‌బీకేల ద్వారానే ధాన్యాన్ని విక్రయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలపురం మండల ప్రత్యేకాధికారి సత్యగోవింద్

గోపాలపురం: రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని మండల ప్రత్యేకాధికారి కె.సత్యగోవింద్ సూచించారు. వ్యవసాయ శాఖ, రైతుల మైత్రీ సంఘ సభ్యులతో గురువారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సత్యగోవింద్ మాట్లాడుతూ ఖరీఫ్ ధాన్యం సేకరణకు కొనుగోలు కేంద్రాలను ఇప్పటికే ప్రారంభించామన్నారు. మైత్రీ కమిటీ ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. రైతులు తప్పనిసరిగా ఆర్‌బీకే ద్వారా అమ్మకాలు సాగించేలా సిబ్బంది పనిచేయాలన్నారు. పట్టుబడికి అవసరమైన గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని తహసీల్దార్ బి.రవీంద్రనాథ్ తెలిపారు. ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి, ఏఓ బి. రాజారావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ గ్రామోత్సవం శోభాయమానం



108 కలశాలతో దేవరపల్లిలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



గోపాలపురంలో లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో దుర్గామాతకు పూజలు

- దేవరపల్లిలో సౌభాగ్య దుర్గాంబికకు గోదావరి జలాలతో అభిషేకం
- కోలాహలంగా శరన్నవరాత్ర ఉత్సవాలు



తాళ్లపూడిలో శ్రీ మహా చండీదేవిగా దుర్గామాత



నల్లజర్లలో మహాలక్ష్మి అవతారంలో దుర్గమ్మ

దేవరపల్లి: దసరా మహోత్సవాలు శోభాయమానంగా సాగుతున్నాయి. రోజుకొక రూపంలో దర్శనమిస్తున్న దుర్గామాతను కొలిచేందుకు భక్తులు, భవానీ మాలధారులు పోటీ పడుతున్నారు. దేవరపల్లిలోని మూడు బొమ్మల సెంటర్లోని సౌభాగ్య దుర్గాంబిక అమ్మవారికి 108 కలశాల గోదావరి జలాలతో గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు అభిషేకం చేశారు. గ్రామ శివార్లలోని పోలవరం కుడి ప్రధాన కాలువ వద్ద మహిళలు గోదావరి జలాలను కలశాల్లో నింపుకుని సుమారు మూడు కిలోమీటర్ల మేర గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామ దేవతలైన కడియాలమ్మ, బాలదుర్గమ్మ వార్ల ఆలయాలను, బీసీ కాలనీలోని శ్రీకృష్ణుడి ఆలయాలను సందర్శించాక, వారు సౌభాగ్య దుర్గాంబిక అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి 108 కలశాల గోదావరి జలాలతో అభిషేకం చేసి, పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన అభిషేకం మధ్యాహ్నం రెండు గంటలకు ముగిసింది.

నల్లజర్ల: మండలంలోని చీపురుగూడెం-తిమ్మన్నపాలెం గ్రామాల మధ్య కొలువైన కనకదుర్గమ్మ ఆలయ 31వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారిని గురువారం మహాలక్ష్మిగా అలంకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వంట్ల పెదరామన్న దంపతుల ఆధ్వర్యంలో పూజాదికాలు జరిగాయి. విశేష సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. నల్లజర్లలోని వనదుర్గ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతపల్లి స్వర్ణదుర్గాశ్రమంలో అబ్బిన గణేష్ చౌదరి, హరిమణి దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అన్నసమారాధన జరిగింది.త్యాజంపూడి శ్రీరామభక్త హనుమాన్ భజన మండలి ఆధ్వర్యంలో హరినామ సంకీర్తన జరిగింది.

మహాచండీదేవి అలంకారంలో..

తాళ్లపూడి: స్థానిక నవదుర్గ, శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ వారిని గురువారం మహాచండీ దేవిగా అలంకరించారు.అర్చకుడు అల్లూరి శివప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి సహస్ర నామార్చన, మహిళలు కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్థానిక గాయత్రీ దేవి ఆలయం వద్ద, మలకపల్లిలోని కనక దుర్గమ్మ ఆలయంలోను విశేష పూజలు చేశారు. వేగేశ్వరపురంలోని దుర్గసాయిరామ్ మేదర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ వారికి పూజలు జరిగాయి. వేగేశ్వరపురం వడ్డీల రామాలయం వద్ద భవానీ మాలధారులు పూజలు చేశారు.

లలితా త్రిపుర సుందరీదేవిగా..

గోపాలపురం: స్థానికంగా కొలువైన దుర్గామాతను గురువారం లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

అమ్మవారికి ఎమ్మెల్యే విశేష పూజలు

నిడదవోలు: స్థానిక వడ్డిల వీధిలోని రావిచెట్టు సెంటర్‌లో శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు పువ్వల రతీదేవి, కొత్తపల్లి సుప్రియ, గోపిరెడ్డి శ్రీనివాస్, ఎండీ షకీరాబేగం, అహ్మదున్నీసాబేగం, చిలకల శారదాదేవి, ఆలమూరి భారతి, ఆరుగొళ్లు వెంకటేశ్వర్లు, ఉసురుమర్తి సరస్వతి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్య ఉంటే చెప్పండి పరిష్కరిస్తాం

- హోం మంత్రి తానేటి వనిత
- చాగల్లులో గడప గడపకూ..



చాగల్లు వాసులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి తానేటి వనిత. చిత్రంలో నాయకులు



వద్దూరులో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

చాగల్లు: ప్రజలకు ఏదైనా సమస్య వచ్చినా, అర్హత ఉండి కూడా సంక్షేమ పథకాలు అందకపోయిన తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారం అయ్యేలా చూస్తానని హోం మంత్రి తానేటి వనిత హామీ ఇచ్చారు. చాగల్లు గ్రామంలో గురువారం ఆమె 147వ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆమె ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగన్ మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. స్థానికుల నుంచి వచ్చిన మౌలిక వసతుల కల్పన, రోడ్లు, డ్రైన్ల సమస్యలపై సంబంధిత అధికారులను పిలిచి ఆదేశాలు జారీ చేశారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను కుటుంబ సభ్యులకు వివరించారు. వారు పొందిన లబ్ధి వివరాలతో కూడిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంతకం చేసిన కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వనితకు చాగల్లు వాసులు హారతులు పట్టి, పూలతో స్వాగతాలు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవినీతి రహిత పాలన అందిస్తూ, మీ అందరికీ తోడుగా నిలుస్తున్న జగనన్నను వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంద్రోతు సురేంద్రకుమార్, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, పార్టీ మండల గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ఎంపీటీసీ ఇంటి బాల వెంకటకృష్ణవేణి, ఉప సర్పంచ్ మేకా రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు వెన్నుదన్నుగా సీఎం జగన్

ఉండ్రాజవరం: రాష్ట్ర ప్రజలకు వెన్నుదన్నుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని వద్దూరు గ్రామంలో గురువారం ఆయన రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జేసీఎస్ చైర్మన్ కఠారి సిద్ధార్థరాజు, సర్పంచ్ రఘుమండ తేజశ్రీ , ఎంపీటీసీ సభ్యురాలు వేండ్ర అనంతలక్ష్మి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గ్రామంలోని ఇంటింటికీ వెళ్ళి సంక్షేమ పథకాలు అమలవుతున్న వివరాలు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. అవి విపక్షాలకు కనబడడం లేదని విమర్శించారు. అనంతరం గ్రామంలో మేరా మట్టి- మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు, పాలాటి శరత్ బాబు, వేండ్ర రమేష్, బయ్యే సత్తిపండు, రాపాక కొండయ్య, మల్లుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తుల వారి కల్పతరువు చేదోడు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- లబ్ధిదారులకు నమూనా చెక్ అందజేత
- నియోజకవర్గంలో 2,205 మందికి రూ.2.21 కోట్ల మేర లబ్ధి



తీపర్రులో లబ్ధిదారులకు చేదోడు నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేదోడు పథకం చేతి వృత్తుల వారికి కల్పతరువుగా మారిందని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. నియోజకవర్గ స్థాయి నాలుగో విడత చేదోడు పథకాన్ని మండలంలోని తీపర్రు గ్రామంలో గురువారం ఆయన ప్రారంభించారు. ఈ ఏడాది ఈ పథకం ద్వారా నియోజకవర్గంలోని 2,205 మంది చేతి వృత్తులవారికి లబ్ధి చేకూరుతోంది. ఒక్కో చేతి వృత్తిదారుడికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.2.21 కోట్ల నమూనా చెక్కును ఎమ్మెల్యే వేదికపై లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటికనుమరుగైపోతున్న చేతి వృత్తులకు జీవం పోసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేదోడు పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకం కింద కుమ్మరి, నాయీ బ్రాహ్మణులు, టైలర్స్, రజక వంటి వారిని అర్హులుగా గుర్తించి ఏటా లబ్ధి చేకూరుస్తున్నామన్నారు.

విలేజ్ క్లినిక్ భవనం ప్రారంభం

తీపర్రు గ్రామంలో రూ.22 లక్షల వ్యయంతో నిర్మించిన విలేజ్ క్లినిక్ భవనాన్ని ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు ప్రారంభించారు. అనంతరం అదే గ్రామంలో ఎమ్మెలే ఆధ్వర్యంలో మండల స్థాయిలో 'మేరా మట్టి- మేరా దేశ్' కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి సేకరించిన మట్టి, బియ్యం, మెటల్‌తో కలిపిన కలశాలను చేత పట్టుకుని గ్రామస్తులు వీధుల్లో ర్యాలీ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఎంపీడీఓ దామోదరరావు, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుందుల భూపతిరావు, సర్పంచ్ కోటిపల్లి శ్రీదేవి, డాక్టర్ హేమరాజు, సొసైటీ అధ్యక్షుడు బలుసు రంగారావు, జేసీఎస్ మండల కన్వీనర్ సూరిబాబు, పార్టీ నాయకులు, మండలంలోని వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఆసరా లబ్ధిదారులు పాల్గొన్నారు.

సురక్షతో ఖర్చు లేకుండా వైద్యం

- హోం మంత్రి తానేటి వనిత
- డివిజన్‌లో ఏడు చోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు
- వేలాది పేదలకు ఉచితంగా ఉన్నత వైద్యం



కుమారదేవంలో రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న హోం మంత్రి తానేటి వనిత



యాదవోలులో రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



నిడదవోలు శిబిరంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

కొవ్వూరు: రూపాయి ఖర్చు లేకుండా పేదలందరికీ నాణ్యమైన ఉచిత వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల లక్ష్యమని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా గురువారం ఏడు ప్రాంతాల్లో సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. వేలాది మందికి వైద్య నిపుణులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. కొవ్వూరు మండలం కుమారదేవంలో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని మంత్రి తానేటి వనిత ప్రారంభించారు. శిబిరానికి హాజరైన ప్రజల ఆరోగ్య సమస్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు. క్యాంపు వద్ద ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు.శిబిరంలో 462 మందికి వైద్య నిపుణులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. రోగులకు మంత్రి వనిత చేతుల మీదుగా మందుల కిట్లు అందజేశారు. నిఖిత (జనరల్ మెడిసిన్), ప్రియాంక (జనరల్ సర్జన్) వైద్యులు ఝాన్సీరాణి, హరి, నవీన్, ఆలీలు రోగులకు సేవలు అందించారు. వైఎస్సార్ సీపీ మండల గౌరవాధ్యక్షుడు గన్నమని వీర వెంకట్రాజు, గోలి శ్రీనివాస్, సర్పంచ్ కాసాని దుర్గ, ఎంపీటీసీ సభ్యురాలు యండపల్లి నట రాజరాణి, కోడూరి సత్తులు, గంధం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మీనానగరంలో 425 మందికి..

చాగల్లు: మీనానగరం ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంత్రి తానేటి వనిత ప్రారంభించారు. రోగులకు వైద్య సేవలు అందుతున్న తీరును కొంతసేపు మంత్రి పరిశీలించారు. వైద్య నిపుణులు శిబిరంలో 425 మందికి రోగ నిర్ధారణ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మెడికల్ టెస్టులు చేశారు. కొందరిని మెరుగైన వైద్యం కోసం ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశారు. రోగులకు మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, మండలశాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, ఉప సర్పంచ్ మేకా రాజు, గంగవరపు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గజ్జరంలో 220 మందికి..

తాళ్లపూడి: మండలంలోని గజ్జరం గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైద్యాధికారులు కరిష్మా తదితరులు 220 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ గండి రాంబాబు ఆధ్వర్యంలో శిబిరానికి ఏర్పాట్లు జరిగాయి. ఎంపీడీఓ రమణ, పంచాయతీ కార్యదర్శి జి.దుర్గాప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు గుంటు చిన్నబ్బాయి, వైఎస్సార్ సీపీ నాయకులు గన్నిన రత్నాజీ, వల్లభని శ్రీహరి, కాకర్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యాదవోలులో 600 మందికి..

దేవరపల్లి: మండలంలోని యాదవోలు జెడ్పీ హైస్కూల్ వద్ద నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన వైద్య పరీక్షల వార్డులను ఆయన పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. హాజరైన ప్రజల ఆరోగ్యం గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార వంటకాలను పరిశీలించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న 600 మంది రోగులకు ఉచితంగా మందుల కిట్లు అందజేశారు. వారిలో 15 మందిని ఉన్నత వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. డాక్టర్లు చిప్పట్, టి.దొరబాబు, నాగదేవి, హరిచందన్, హర్షవర్ధన్, చక్రవర్తి శిబిరంలో వైద్య సేవలు అందించారు. సర్పంచ్ సున్నం వరప్రసాద్, ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఎంపీటీసీ సభ్యులు తమ్మిరెడ్డి నాగప్రసన్న, కొమారపు హారికాజ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు విసాకోడేటి కోటేశ్వరరావు, అనిశెట్టి సూర్యచంద్రరావు, మండల ప్రత్యేకాధికారి జి.రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

నిడదవోలులో 306 మందికి..

నిడదవోలు: పట్టణంలోని బస్టాండ్ సెంటర్ సచివాలయం పరిధిలోని ప్రజల కోసం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ప్రారంభించారు. శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను, అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ఆయన పరిశీలించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి గుమ్మాపు హేనా ఆధ్వర్యంలో ఇద్దరు వైద్య నిపుణులు, ఇద్దరు జనరల్ వైద్యులు కలిసి 306 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారిలో 40 మందికి కంటి పరీక్షలు చేసి 18 మందికి కళ్లజోళ్లు అందించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కమిషనర్ కేవీ పద్మావతి, నెహ్రూ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి ఈ.తేజశ్రీ ,కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాల్దారిలో 418 మందికి..

ఉండ్రాజవరం: మండలంలోని కాల్దారి గ్రామంలో ఎంపీడీవో గాడిరాజు రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వేలివెన్ను పీహెచ్‌సీ డాక్టర్ ఎస్‌జే ఇర్ఫాన్ (ఎండీ) ఆధ్వర్యంలో డాక్టర్ ఉషాదేవి, ఫణీంద్ర (ఆర్థోపెడిక్), షణ్ముక (జనరల్ ఎండీ)లు 418 మందికి వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. శిబిరానికి హాజరైన జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, వైస్ ఎంపీపీ చెట్టి నవీన్ రోగులకు మందులు పంపిణీ చేశఋూరు. 13 మందిని వివిధ ఆపరేషన్ల నిమిత్తం ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశారు. గుణ్ణం రవికుమార్, సర్పంచ్ చీపుళ్ళ కుమారి, బొందల మహాలక్ష్మడు, బూరుగుపల్లి శ్రీనివాసు, ఎస్.శ్రీను, సాధనాల ఉమ పాల్గొన్నారు.

తాడిమళ్లలో 449 మందికి..

నిడదవోలు రూరల్: తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, సర్పంచ్ బయ్యే రాధారాణి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్యలు ప్రారంభించారు. తాడిమళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు జి.సుధీర్‌కుమార్, దివ్య పర్యవేక్షణలో వైద్య నిపుణులు 449 మందికి పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ పెనుగొండ కృష్ణమోహన్, పార్టీ గ్రామ అధ్యక్షుడు కటికిరెడ్డి నారాయణరావు,ఎంపీడీఓ పి.శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

కాకరపర్రులో 521 మందికి..

పెరవలి: మండలంలోని కాకరపర్రు గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ ప్రారంభించారు. వైద్య పరీక్షల అనంతరం రోగులకు మందుల కిట్లు అందించారు. ఈ శిబిరంలో 521 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వారిలో 24 మందికి ఆరోగ్యశ్రీ పథకంలో ఉన్నత వైద్యం కోసం పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేశామని స్థానిక వైద్యురాలు తేజశ్రీ తెలిపారు. గైనకాలజీ, ఆప్తమాలజీ, ఈఎన్‌టీ నిపుణులు ఐ.శశిరేఖ, పి.ఉమాశంకర్, హేమరాజు, ఏఎస్ కృష్ణవేణి వైద్య సేవలు అందించారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, సర్పంచ్ గుబ్బల ఆదిలక్ష్మి, గుబ్బల శ్రీనివాస్, ఉప సర్పంచ్ చెర్ల శ్రీరామచంద్రమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.